క్లుప్తంగా

బైకు అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు



108లో చికిత్స చేస్తున్న సిబ్బంది

దొనకొండ: వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కలివెలపల్లి-సంగాపురం గ్రామాల మధ్య శుక్రవారం జరిగింది. తెలిసిన సమాచారం ప్రకారం.. కలివెలపల్లి గ్రామానికి చెందిన ఎస్.యోనా పనిపై సంగాపురం వైపు వెళ్తున్నాడు. రహదారి గుంతలమయం కావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. ఎడమ కాలు పూర్తిగా విరిగింది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది వెలుగొండయ్య, వెంకటేశ్వర్లు సంఘటన స్థలం చేరుకుని ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఓఈ రాజేంద్రప్రసాద్, పీఎం విజయకుమార్ 108 సిబ్బందిని అభినందించారు.

నేడు నవోదయ ఎంట్రన్స్ పరీక్ష

పుల్లలచెరువు: నవోదయ ప్రవేశ పరీక్షను శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు పరీక్షల నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలో ప్రవేశ పరీక్షను నిర్వహించడం ఇదే మొదటిసారి. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే నవోదయ ప్రవేశ పరీక్షకు మండలంలోని పిడికిటివానిపల్లి జెడ్పీ పాఠశాలను పరీక్ష కేంద్రంగా అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మొత్తం 250 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారని, విద్యార్థులు ఉదయం 10.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 11 గంటలకు విద్యార్థులను అనుమతిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. తప్పని సరిగా హాల్ టికెట్ తీసుకు రావాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకుని రాకూడదన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. కేంద్రం వద్ద పోలీసు బందోబస్త్ ఉంటుందని శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఘనంగా ఇరుముడి, హోమం



హోమం చేస్తున్న పండితులు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం సంకటహర చతుర్థి రోజును మంచి రోజుగా భావించి ఆలయ అర్చకులు స్వామి పంతులు ఆధ్వర్యంలో దీక్ష తీసుకున్న స్వాములకు ఇరుముడి హోమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పసుపు కుంకుమతో పాటు పంచామృతాలతో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులతో మహిళల బెంబేలు

- కూటమి ప్రభుత్వంలో ఏరులై పారుతున్న మద్యం
- అధికారికంగా 3 షాపులు.. అనధికారికంగా 200పైనే
- లైసెన్స్‌డ్ షాపుల్లో కన్నా బెల్ట్‌షాపుల్లోనే విక్రయాలు అధికం
- దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి కనుసన్నల్లో మద్యం వ్యాపారం



కురిచేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆవులమంద గ్రామస్తులు

కురిచేడు: మండలంలో మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరజిల్లుతోంది. ప్రభుత్వం అధికారికంగా మండలానికి మూడు మద్యం దుకాణాలు మంజూరు చేసింది. కానీ అనధికారికంగా మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 200కు పైగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. లైసెన్స్‌డ్ షాపుల్లో ఎమ్మార్పీకి మాత్రమే మద్యం విక్రయించాల్సి ఉంది. బెల్ట్‌షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండటంతో షాపుల యజమానులు బెల్ట్‌షాపులపై మక్కువ పెంచుకున్నారు. ప్రతి గ్రామానికి నేరుగా తమ సొంత మనుషులతో మద్యం బాటిళ్లు సరఫరా చేస్తున్నారు. లైసెన్స్‌డ్ షాపుల్లో 150 రూపాయలకు విక్రయించే మద్యం బాటిల్ బెల్ట్‌షాపుల్లో రూ.220, లైసెన్స్‌డ్ షాపుల్లో రూ.180లకు విక్రయించే మద్యం బాటిల్ బెల్ట్‌షాపుల్లో రూ.320లకు విక్రయిస్తున్నారు. తాగునీరు లభించని గ్రామాలున్నాయిగానీ మద్యం లభించని గ్రామాలు మాత్రం భూతద్దం పెట్టి వెతికినా కనిపించవు. పేరుకు మద్యం ధరలు తగ్గించామని, బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పే ప్రభుత్వ పెద్దలకు ప్రజలు తిరగబడటం గొంతులో ఎలక్కాయపడినట్లుంది. పనుల కాలం కావడంతో మద్యం కోసం కురిచేడు వరకు రాలేని మద్యం ప్రియులు తమ గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో అధిక ధరలకు కొనుగోలు చేసి తమ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగి తమ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. కొందరు పగలంతా కష్టపడి కూలినాలి చేసి తెచ్చిన డబ్బులతో మద్యం షాపుల్లో తమతో పాటు ఇతరులకు మద్యం పోయించి కూలి డబ్బు కాజేసుకుంటున్నారు. తమను నమ్ముకుని ఉన్న కుటుంబ సభ్యులను పట్టించుకోవడం లేదు. మండలంలోని అన్ని గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాపులు వెలిశాయి. అనుమతి పొందిన వైన్‌షాపుల నుంచి బెల్ట్ షాపులకు నిత్యం వందల సంఖ్యలో మద్యం బాటిళ్లు తరలిస్తున్నారు.

వీధివీధికీ బెల్ట్‌షాపులు

గ్రామాల్లో ఏ వీధికి వెళ్లినా బెల్ట్‌షాపు దర్శనమిస్తోంది. కూల్‌డ్రింక్ షాపులతో పాటు కిరాణాషాపుల్లో కూడా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వైన్ షాపుల యజమానులు ఆటోల్లో , ద్విచక్ర వాహనాల్లో మద్యాన్ని ఊరూరా సరఫరా చేస్తున్నారు. యువకులు కొందరు మద్యం మత్తులో నిత్యం గొడవలు పడుతూ నానారభస చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించేందుకు అధికార పార్టీ నాయకుల ఒత్తిడే కారణమని తెలుస్తోంది. మద్యం వ్యాపారం విషయంలో అధికార పార్టీ నియోజకవర్గ స్థాయి ఇన్‌చార్జి పాత్ర ప్రధానంగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికైనా అక్రమ సంపాదన కోసం పేదల జీవితాలను ఫణంగా పెట్టవద్దని, గతంలో ఈ విధంగా ఏ ప్రభుత్వం బెల్ట్‌షాపులు నిర్వహించ లేదని, అధికారులు కఠినంగా వ్యవహరించకుంటే తామే తగిన బుద్ధి చెప్తామని ప్రజలు హెచ్చరిస్తున్నారు. శుక్రవారం మండలంలోని ఆవులమంద గ్రామంలో రాజకీయ పార్టీలకు అతీతంగా మహిళలు ఒక్కటై ఆందోళనకు దిగారు. బెల్ట్‌షాపులకు సంబంధించి కురిచేడు వెళ్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

అమ్మ ఒడికి పంగనామాలు



నరసాయపాలెంలో వైఎస్సార్, జగనన్న చిత్రపటాలు ప్రదర్శిస్తున్న అభిమానులు



విద్యుత్ ప్రభపై నుంచి మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: పేద విద్యార్థుల చదువులు కుటుంబాలకు ఆటంకం కాకూడదన్న ఉద్దేశంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్కూల్‌కు వెళ్లే విద్యార్థి తల్లి అకౌంట్‌లో క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం రూ.15 వేలు జమ చేసేవారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మకు వందనం పథకం కింద నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు, కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని, ఆ పథకాన్ని అడ్రస్ లేకుండా చేశారని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. యర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల్లోని నర్సాయపాలెం, ఎండూరివారిపాలెం గ్రామాల్లో జరిగిన గుత్తికొండ రామయోగి తాత ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి జరిగిన తిరునాళ్లలో ఆయన విద్యుత్ ప్రభలపై నుంచి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎండూరివారిపాలెంలో మాట్లాడుతున్న సమయంలో ఒక చిన్నారి నాకు అమ్మ ఒడి రావడం లేదని బిగ్గరగా అరవడంతో ఆయన స్పందించి అమ్మ ఒడికి చంద్రబాబు నాయుడు పంగనామాలు పెట్టిండమ్మా, జగన్ మామయ్య తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పథకాన్ని పునరుద్ధరిస్తారని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ప్రధాన పదవులు అలంకరించిన చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్, పవన్ కల్యాణ్‌లు ఎన్నికల ముందు చెప్పిన మాటలు మరచిపోయారని, అధికారంలోకి వచ్చిన వారు సూపర్ సిక్స్ పథకాల్లో అరకొరగా ఒక పథకాన్ని అమలు పరచి మిగిలిన పథకాలకు తిలోదకాలు చుట్టారని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ కాలంలో గ్రామీణ ప్రాంతాలు కళకళలాడేవని, ఇప్పుడు కళతప్పినట్లు ఉన్నాయని, కక్షలు, కార్పణ్యాలకు తావులేకుండా ఆయన పాలన అందించారని, ఇప్పుడు అన్నదమ్ముళ్లుగా మెలగాల్సిన వారు ఘోరంగా ప్రవర్తిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. రైతు భరోసా ఊసే ఎత్తకుండా రైతులను అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటాలు జరిపినప్పటికీ వారికి చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. నన్ను ఆదరించిన నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని, సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముందుగా ఆయా గ్రామాల్లో ప్రజలు అశేషంగా పాల్గొని ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. నర్సాయపాలెంలో ఆయన మాట్లాడుతున్న సమయంలో విద్యుత్ ప్రభ ముందు వైఎస్సార్, జగన్‌మోహన్‌రెడ్డి, సినీనటుడు మహేష్‌బాబు చిత్రపటాలను ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షులు కె.ఓబులరెడ్డి, ఎస్.పోలిరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కందుల సత్యనారాయణ చౌదరి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, ఏకుల మునసలారెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాస్, దోగిపర్తి సంతోష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తాటిపర్తి ప్రత్యేక పూజలు



స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి



పురవీధుల్లో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

పుల్లలచెరువు: మండలంలోని చెన్నంపల్లిలో వెలసిన గుత్తికొండ రామయోగ స్వామి వారి తిరునాళ్ల సందర్భంగా యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సర్పంచ్ టి.సత్యనారాయణరెడ్డి ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈయన వెంట సర్పంచ్‌లు కోటిరెడ్డి, యండ్రపల్లి స్వామి, మాజీ ఎంపీపీ ఎం.సుబ్బారెడ్డి, బి.సుబ్బారెడ్డి, ఎంపీటీసీ రాములు, పీఏసీఎస్ డైరెక్టర్ రఘు, సీనియర్ నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు, ఏఎంసీ డైరెక్టర్ గంగరాజు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎల్. ప్రసాద్, రోసిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, కోటిరెడ్డి, చరణ్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. పురవీధుల్లో ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు భారీ ఎత్తున ప్రజలు స్వాగతం పలికారు.

పరిమితికి మించిన ప్రయాణికులతో అనర్థం



ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న సీఐ ప్రభాకరరావు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్

పెద్దదోర్నాల: పరిమితికి మించిన ప్రయాణికులతో ప్రయాణించడం అనర్థమని యర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు వాహనదారులకు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో పాటు పలు వాహనదారులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ఆటోల్లో పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించుకుని వారిని గమ్యస్థానాలకు చేర్చడంలో విఫలమవుతున్నారని పేర్కొన్నారు. కూలీనాలి చేసుకుని జీవించే కూలీలను ఎక్కించుకుని పరిమితికి మించి ఓవర్ లోడుతో ప్రయాణాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఓ కారులో నలుగురు ప్రయాణిస్తే ఆటోలో 20 మంది వరకు ప్రయాణిస్తున్నారని చెప్పారు. ఇలా ప్రయాణికులను ఇష్టానురీతిలో ఎక్కించుకుని వారి జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. దీంతో పాటు కొందరు వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపటంతో అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అతివేగం, నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరిగి ఎన్నో కుటుంబాల్లో విషాదాలు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ వాహనదారులందరూ తప్పని సరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని, యజమానులు డ్రైవర్ల లైసెన్స్‌లు పరిశీలించి వారికి వాహనాలు ఇవ్వాలని కోరారు. సెల్‌ఫోన్‌లు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడపటం నేరమన్నారు. డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఎస్సై మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దారవీడు: రోడ్డు నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పి.అనిల్‌కుమార్ హెచ్చరించారు. 565 జాతీయ రహదారిపై మండలం పరిధిలో గొబ్బూరు, దేవరాజుగట్టు గ్రామాల కూడలి వద్ద రోడ్డు ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లు, ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఆటోలో ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకోరాదని, అలా ఎక్కువ మందిని ఎక్కించుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని, డ్రైవర్ల అజాగ్రత్తతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. డ్రైవర్లు మద్యం తాగడం, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకుని కుటుంబ సభ్యులను అనాథలను చేయవద్దని సూచించారు. ఆటోల్లో డ్రైవర్‌కు ఇరువైపులా ఎవరినీ కుర్చోపెట్టకుండా ఉండాలని, వెనుక వైపు కూడా ప్రయాణికులను కుర్చోనీయకుండా డోర్‌లాక్ చేసుకోవాలన్నారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుకుంటూ వాహనాలు నడపరాదని, డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని, యూనిఫాం ధరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుబ్బయ్య, పోలీసులు పాల్గొన్నారు.

ఆ గ్రామ చెరువుకు వేలంలో రూ.29 లక్షల నష్టం

- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.58 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

దర్శి: మండలంలోని తూర్పు చౌటపాలెం చెరువును గ్రామానికి చెందిన మారం బాల వెంకటరెడ్డి రూ.29 లక్షలకు పాడుకున్నాడు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం చెరువుకు వేలంపాట నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చెరువుకు బహిరంగ వేలంపాట నిర్వహించగా రూ.58 లక్షలకు పాడుకున్నారు. ప్రస్తుతం నాలుగు సార్లు పాట పెట్టినా ఎవరూ ముందుకు రాక పోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ మద్దతు ధర రూ.25 లక్షలుగా నిర్ణయించారు. పలువురు వేలంపాటలో పాల్గొన్నా పాట పాడుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పథకం ప్రకారం మూడు సార్లు వేలం పాట పెట్టి వాయిదాలు వేయడంపై అధికారులు, గ్రామ నాయకులు కుమ్మక్కయ్యారన్న ప్రచారం జరుగుతోంది. గ్రామ అభివృద్ధి కోరుకునే నాయకులు, అధికారులు వేలం పాటలో ఎక్కువ పాట పోయేలా చర్యలు తీసుకోవాల్సింది పోయి ఇలా తక్కువ పాట పోయేలా పావులు కదపడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేలం పాటలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, కార్యదర్శి చక్రవర్తి పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెట్రోల్ బంక్ నిర్మాణం కోసం స్థల పరిశీలన

దొనకొండ: మండలంలోని ఆరవల్లిపాడు, తెల్లబాడు గ్రామాల మధ్యలో ఎల్‌పీ నంబర్ 1604 పెట్రోల్ బంక్ కోసం అవసరమైన స్థలాన్ని కనిగిరి ఆర్‌డీఓ జి.కేశవర్ధనరెడ్డి శుక్రవారం పరిశీలించారు. గంగదేవిపల్లి గ్రామానికి చెందిన బొరిగొర్ల వెంకటేశ్వర్లు పెట్రోల్ బంక్ నిర్మాణానికి అవసరమైన భూమి కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ స్థలాన్ని పరిశీలించారు. నిబంధనలకు అనుకూలంగా నిర్మించాలని దరఖాస్తుదారుడిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ బి.రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ కేవీ నాగార్జునరెడ్డి, వీఆర్‌ఓ బొర్రయ్య, లైసెన్స్ సర్వేయర్ సీహెచ్ వెంకట్రావు ఉన్నారు.

ఐదో రోజుకు చేరిన టీసీఆర్ క్రికెట్ టోర్నమెంట్

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరుగుతున్న టీసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం నాటికి 5వ రోజుకు చేరింది. అందులో భాగంగా రెండో రౌండ్‌లో యర్రగొండపాలెం ఏబీఎస్ జూనియర్ టీం, కుంట లాజ్యా బాయిస్ టీం, నరజాముల తండా మంత్రుస్వామి టీం, తంగిరాలపల్లి టీం, వై.పాలెం వసంత టీం, పెద్దారవీడు క్రిక్స్ ఫోర్స్ టీం, త్రిపురాంతకం హోం టీం, వైపాలెం ఇందిరా నగర్ గోల్డెన్ బాయిస్ టీం, రేగుమానిపల్లె పీవీఆర్ టీం, గంటవానిపల్లె చంద్రశేఖర్ అన్న సైన్యం టీం, జమ్మిదోర్నాల జగనన్న టీం, దోర్నాల ఏబీఎం టీం, దోర్నాల విక్టరీబాయిస్ టీం , గంజివారిపల్లె టీం, 3వ రౌండ్‌లో చంద్రశేఖరన్న సైన్యం టీం విజేతలుగా కొనసాగుతున్నాయి.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ చించివేత



దుండగులు చింపేసిన ఫ్లెక్సీ

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పూరిమెట్లలో వైఎస్సార్ సీపీ అభిమానులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీని దుండగులు చించివేశారు. ఉద్దేశ పూర్వకంగా ఫ్లెక్సీని చింపిన పిరికి పందలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో తాము ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీని చింపి గొడవలు సృష్టించాలని కుట్రలు చేస్తున్నారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

కురిచేడు: రైతులు పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కంది పంట వేసి ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు కంది కొనుగోలు కేంద్రాల్లో కందులు విక్రయించుకునేందుకు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

తాళ్లూరు: వాతావరణంలో వస్తున్న అనూహ్య పరిణామాలకు కొన్ని సందర్భాల్లో చేతికి వచ్చిన పంటలు దెబ్బతిని రైతులకు నష్టం జరిగే అవకాశం ఉంటుందని, చిరుధాన్యాల సాగుతో ఎలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా రైతు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉండదని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు తెలిపారు. శుక్రవారం నాగంబొట్లపాలెం, తూర్పు గంగవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సస్యరక్షణలో భాగంగా కాండం తొలిచే పురుగు, గులాబీ పురుగు నివారణకు ఐదు శాతం వేపగింజల కషాయం లేదా వేప నూనె మూడు వేల పీపీఎం ఐదు మిల్లీలీటర్లు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ప్రకృతి సాగు ఇన్‌చార్జి పి.నరసింహులు, ఐసీఆర్పీ వాణి, రైతులు పాల్గొన్నారు.

దొనకొండ: గ్రామాల్లో పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని ఇండ్లచెరువు, మంగినపూడి రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది ప్రతి రైతుతో మాట్లాడి వారి పేర్లు నమోదు చేయాలన్నారు. ఆధార్ నంబర్ మాదిరి ప్రతి రైతుకు ప్రత్యేక సంఖ్యను కేటాయిస్తారని తెలిపారు. దీని ద్వారా ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు ఐడీ నంబర్ కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల రాయితీలు భూ ఆధార్ చెల్లింపులు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట నష్ట పరిహారం, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీ ద్వారా పనిముట్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాల్లోని రైతులు వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని ఏఓ తెలిపారు. ఆయన వెంట గ్రామ రైతులు, సిబ్బంది విన్నిబాబు, రాధిక పాల్గొన్నారు.



తాళ్లూరు: రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రసాద్‌రావు

పుల్లలచెరువు: ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలో తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి నిర్మలాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని యండ్రపల్లి, మల్లాపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించి తగు సూచనలు చేశారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఎక్కువగా ఉందని దాని నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. కంది పంటను సాగు చేసిన రైతులు సమీప రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ సూచించారు. రైతులు తగు సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ఏపీ ఎంఐపీ అధికారి రామయ్య మాట్లాడుతూ 90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు ఇస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఏఏలు ప్రశాంత్‌నాయక్, రాంబాబు, వీహెచ్‌పీ రాజశేఖర్ పాల్గొన్నారు.


పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరు, దేవరాజుగట్టు గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా కంది, వరిగ పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి మాట్లాడుతూ వరిగ పంటలో వచ్చే శనగపచ్చ పురుగు కంకి దశలో ఆశించిన పూత, గింజలను తిని నష్టపరుస్తుందని, నివారణకు పురుగు ఆశించినప్పుడు కంకులను దులిపి లేదా చేతితో ఏరివేసి నాశనం చేయాలని, క్వినాలాఫాస్ 25 శాతం ఈసీ మందు 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి అవసరాన్ని బట్టి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు.

వరిగ, కొర్ర పంటల్లో చెదలు ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయి. తేలిక నేలల్లో, వర్షాభావ పరిస్థితుల్లో పంటలను పండించినపుడు చెదలు ఎక్కువగా నష్టం కలుగజేస్తాయని, వాటి నివారణకు పంటల చుట్టూ అక్కడక్కడా ఎత్తుగా కనిపించే పుట్టను నాశనం చేయాలని, ఆ పుట్టలపై భాగంలో రంధ్రం చేసి క్లోరిపైరిఫాస్ 50 ఇ 5 ఎంఎల్ లీటరు నీటిలో కలిపిన మందును ఒక్కో పుట్టలో 10 నుంచి 12 లీటర్ల మందు ద్రావణం పోయడం ద్వారా చెదలను నివారించవచ్చన్నారు. ప్రస్తుతం పంటలో మారుక మచ్చ పురుగు ఉధృతి ఎక్కువ ఉందని గుర్తించారు. పురుగు నివారణకు తొలి దశలో క్లోరిపైరపాస్ 2.5 ఎంఎల్ తర్వాత దశలో నోవల్యూరాన్ 1 ఎంఎల్, ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు స్పైనోసాడ్ 0.3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ఏఓ బుజ్జిబాయి సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ముండ్లమూరు (దర్శి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జనార్దన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్నీ శాఖల అధికారులు పాల్గొని సమావేశం విజయవంతం చేయాలని కోరారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా గురునాథం



నియామక పత్రం అందుకుంటున్న గురునాథం

పుల్లలచెరువు: మండల కేంద్రంలో మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడి ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన గోపవరపు గురునాథాన్ని అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ఎన్నికల నిర్వాహకుడు అనుమాలశెట్టి సుబ్బారావు తెలిపారు. గురునాథం మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు. ప్రధాన కార్యదర్శిగా ఫణీంద్రకుమార్, ఉపాధ్యక్షుడిగా రాంప్రసాద్, కోశాధికారిగా కె.వెంకటేశ్వర్లును ఎన్నుకున్నట్లు సుబ్బారావు తెలిపారు. గురునాథం ఎన్నిక కావడంతో పలువురు అభినందనలు తెలిపారు. ముఖ్య అతిథిగా వై.పాలేనికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొత్తమాసు సుబ్రహ్మమణ్యంతో పాటు పుర ప్రముఖులు జి.భాస్కరరావు, యు.హనుమంతరావు, పుల్లారావు, బాలాంజనేయులు, కిష్టయ్య, నరసింహారావు పాల్గొన్నారు.